సాక్షి తిరుపతి

సోమవారం ၊ 15 ၊ మే ၊ 2023



హనుమా.. కనుమా

హనుమజ్జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు.

- 8లో



ఫుట్‌బాల్ టోర్నీ విజేత తమిళనాడు

నాయుడుపేటలో నిర్వహిస్తున్న సౌత్‌ఇండియా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో తమిళనాడు చెన్నై పోలీస్ జట్టు విజేతగా నిలిచింది.

- 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	42	29
చిత్తూరు	41	28
తిరుమల	38	24
గూడూరు	44	31
నగరి	43	29

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'



వెంకటరమణారెడ్డి, కలెక్టర్

తిరుపతి అర్బన్ : ప్రజాసమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. అర్జీలు రాసేందుకు ప్రత్యేకంగా ముగ్గురు వీఆర్‌ఓలను నియమించినట్లు వివరించారు. స్పందనకు అన్ని శాఖల ఉన్నతాధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.

ఆగమోక్తంగా లక్ష్మీనరసింహుని ఆలయ సంప్రోక్షణ



పూర్ణాహుతి చేపడుతున్న అర్చక పండితులు

తిరుపతి కల్చరల్: కపిలతీర్థంలోని పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయ మహా సంప్రోక్షణం ఆదివారం ఆగమోక్తంగా నిర్వహించారు. మూడు రోజులుగా చేపట్టిన వైదిక కార్యక్రమాలు మహా సంప్రోక్షణంతో ఘనంగా ముగిశాయి. ఉదయం పుణ్యాహవచనం, విష్వక్సేన ఆరాధన, కుంభారాధన, విశేష హోమం నిర్వహించి మహా పూర్ణాహుతి చేపట్టారు. కుంభ ప్రదక్షిణం, నైవేద్యం సమర్పించి ప్రధాన కలశాన్ని గర్భాలయంలోకి తీసుకెళ్లి స్వామి, అమ్మవారికి సంప్రోక్షణ చేశారు. ఉదయం 9–10 గంటల మధ్య మిథున లగ్నంలో శ్రీలక్ష్మీనరసింహస్వామికి కళావాహన, మహా సంప్రోక్షణ నిర్వహించారు. తర్వాత భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం వేద పారాయనం చేసిన పురోహితులకు టీటీడీ తరఫున టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్ సంభావన అందజేశారు. కార్యక్రమంలో తిరుమల శ్రీవారి ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాలదీక్షితులు, కంకణభట్టార్ సూర్యకుమార్ ఆచార్యులు, డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.



టోర్నీ ప్రారంభిస్తున్న టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, వేదికపై ఎమ్మెల్యే చెవిరెడ్డి తదితరులు

అట్టహాసంగా చంద్రగిరి ఐపీఎల్

వందలాది జట్లు...రంగురంగుల క్రీడా దుస్తులతో వేలాది మంది క్రీడాకారులు... ఎటు చూసినా మైదానాలు..ఉత్కంఠంగా సాగుతున్న మ్యాచ్‌లు...హోరెత్తించే యువత నినాదాలు...విజేతల హర్షాతిరేకాలు.. ప్రతి ఒక్కరిలోనూ క్రీడాయజ్ఞంలో పాలుపంచుకున్న భావన...తండ్రిని మించిన తనయుడిగా 'ఆట' ఆరంభించారని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిపై ప్రశంసలతో ఆదివారం చంద్రగిరి ఐపీఎల్ టోర్నీ అట్టహాసంగా ప్రారంభమైంది.

- ఒకే వేదికపై 1000 జట్లు.. 15వేల మంది క్రీడాకారులు
- దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకే చోట 16 గ్రౌండ్లు ఏర్పాటు
- క్రికెట్ టోర్నమెంట్‌కు విశేష స్పందన

తిరుపతి రూరల్: గ్రామీణ యువతలోని క్రీడా నైపుణ్యాలను వెలికి తీయాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఏటా వైఎస్సార్ గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. వందలాది జట్లతో జరిగే ఈ టోర్నమెంట్ చంద్రగిరి ఐపీఎల్‌గా పేరు పొందింది. కరోనా కారణంగా గత రెండేళ్లుగా నిలిచిన ఈ పోటీలను చంద్రగిరి వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పునఃప్రారంభించారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి క్రీడాకారులను టోర్నీకి ఆహ్వానించారు. తుమ్మలగుంట వేదికగా ఒకే చోట 16 గ్రౌండ్లను ఏర్పాటు చేశారు ఒక్కో గ్రౌండ్ నుంచి ప్రతి రోజు నాలుగు మ్యాచ్‌లు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. సుమారు వెయ్యి జట్లు క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు దరఖాస్తులు చేయడంతో అందుకు తగ్గట్టుగా భారీ సన్నాహాలు చేశారు. ప్రత్యక్షంగా 15 వేల మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. మరో 10 వేల మంది ప్రేక్షకులు మ్యాచ్‌లను తిలకించేందుకు వస్తున్నారు.

ట్రోఫీ గ్యాలరీ ప్రారంభం

తుమ్మలగుంటలో వైఎస్సార్ గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్ (చంద్రగిరి ఐపీఎల్)కు టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చేతులు మీదుగా ఆదివారం శ్రీకారం చుట్టారు. ముందుగా క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు బహూకరించనున్న ట్రోఫీలు, మెడల్స్ గ్యాలరీని ప్రారంభించారు. మైదానంలోకి చేరుకుని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సరదాగా క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడారు.

క్రీడా మైదానాలు అవసరం : మోహిత్‌రెడ్డి

పల్లెల్లో ఆలయాలు ఎంత ముఖ్యమో.. క్రీడా మైదానాలు అంతే అవసరమన్న స్వామి వివేకానంద మాటలను స్ఫూర్తిగా తీసుకుని గ్రామీణ యువతను క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామని చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వెల్లడించారు. 40 ఏళ్ల తర్వాత ఆస్పత్రికి వెళ్లకూడదు అనుకుంటే 20 ఏళ్ల నుంచే గ్రౌండ్‌కు వెళ్లడం అలవాటు చేసుకోవాలని సూచించారు. క్రీడా స్ఫూర్తితో స్నేహపూర్వక వాతావరణంలో మ్యాచ్‌లు ఆడాలని కోరారు.

ప్రజలకు అండగా ఉంటాం : చెవిరెడ్డి

కష్టాలు వచ్చినా.. సంతోషం వచ్చినా.. ఆపద వచ్చినా.. ఆర్థిక సమస్యలు వచ్చినా.. కులం చూడం.. మతం చూడం.. పార్టీలు చూడం.. అందరికీ అండగా నిలవడమే ధ్యేయం..నా కుటుంబంతో సమానంగా చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రజలను చూసుకోవడం తనకు అలవాటని ఎమ్మెల్యే చెవిరెడ్డి స్పష్టం చేశారు. టోర్నమెంట్ లో పాల్గొనే ప్రతి జట్టుకు రూ.20వేల విలువైన క్రికెట్ కిట్ ఇవ్వడంతో పాటు ప్రతి క్రీడాకారుడికీ బ్రాండెడ్ టీ షర్ట్, పార్టిసిపేట్ సర్టిఫికేట్, మెడల్స్ బహూకరిస్తున్నట్లు తెలిపారు. పోటీలు పారదర్శకంగా నిర్వహించేందుకు నిష్ణాతులైన 80 మంది అంపైర్లను అందుబాటులోకి తీసువచ్చామన్నారు. టోర్నీ విజేతకు రూ.25లక్షల మేర నగదు బహుమతులు ఇస్తున్నామని చెప్పారు. క్రీడాకారులకు ప్రతి రోజు ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు నిరంతరం అల్పాహారం, భోజనం, తాగునీటి వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు.

తొలిరోజు విజేతలు బందార్లపల్లె, సప్తగిరికాలనీ

క్రికెట్ టోర్నమెంట్ తొలిరోజు రెండు మ్యాచ్‌లను మాత్రమే నిర్వహించారు. బందార్లపల్లె, సప్తగిరి కాలనీ జట్లు విజేతలుగా నిలిచాయి.

చెవిరెడ్డి కుటుంబం వెంటే యువత



చంద్రగిరి యువత మొత్తం చెవిరెడ్డి కుటుంబం వెంటే నడుస్తోందని, ఇందుకు ఈ టోర్నమెంటే నిదర్శనమని టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. క్రికెట్ పోటీలను ప్రారంభించిన తర్వాత ఆయన మాట్లాడుతూ నియోజక వర్గ ప్రజలను తన కుటుంబ సభ్యులుగా భావించే చెవిరెడ్డిపై జనాభిమానం వెల్లువెత్తుతోందన్నారు. క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పిలుపునిచ్చిన పది రోజుల్లోనే వెయ్యి జట్లు సిద్ధం కావడం చూస్తుంటే ప్రజల్లో ఆ కుటుంబానికి ఉన్న ఆదరణ ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చని వెల్లడించారు. కలెక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ భరోసా కల్పించే చెవిరెడ్డి వంటి నాయకుడు ఎమ్మెల్యేగా దొరకడం చంద్రగిరి ప్రజల అదృష్టమన్నారు. జేసీ బాలాజీ, తుడా వీసీ హరికృష్ణ, కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.



క్రీడాకారులకు క్రికెట్ కిట్‌ల పంపిణీ



ట్రోఫీలను పరిశీలిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



క్రికెట్ ఆడుతున్న వైవీ సుబ్బారెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, జేసీ బాలాజీ, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రైల్వేస్టేషన్‌లో పెరిగిన రద్దీ

తిరుపతి అర్బన్ : వేసవి సెలవుల నేపథ్యంలో తిరుపతి రైల్వేస్టేషన్ ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. నిత్యం పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. తిరుపతి మీదుగా సుమారు 96 రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో నెలకు రూ.35లక్షలకు పైగా రాబడి వస్తోంది. రద్దీ మేరకు రైల్వే అధికారులు మెరుగైన వసతులు సమకూరుస్తుండడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గూడూరులో జాతీయ స్థాయి నాటక పోటీలు



గూడూరు: పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలు ఆవరణలో సంస్కృతి సమ్మేళనం సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ స్థాయి నాటక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కరీంనగర్‌కు చెందిన చైతన్య కళాభారతి వారు ప్రదర్శించిన 'చీకటి పువ్వు', గుంటూరుకు చెందిన శ్రీఅమృత లహరి థియేటర్ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన 'నాన్నా నేనొచ్చేస్తా' నాటకాలు ప్రేక్షకులను అలరించాయి. చీకటి పువ్వు నాటికలో పరిస్థితులకు ఎవరూ అతీతులు కారనే వాస్తవానికి అద్దం పట్టేలా కళాకారులు తమ పాత్రలకు ప్రాణం పోశారు. ''నాన్నా..నేనొచ్చేస్తా'' నాటిక ప్రస్తుత సమాజ పోకడలను వివరిస్తూ సందేశాత్మకంగా సాగింది.

దాస్యభక్తికి ప్రతీక హనుమంతుడు



శ్రీమఠం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి

తిరుమల : నవవిధ భక్తి మార్గాల్లో ఒకటైన దాస్యభక్తికి ప్రతీక హనుమంతుడని తపోవనం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి మహాస్వామి తెలిపారు. ఆదివారం తిరుమలలో నాదనీరాజనం వేదికపై స్వామి వారు అనుగ్రహభాషణం చేశారు. అంజనాద్రిలో హనుమంతుడు జన్మించారని, సూర్యనారాయణ స్వామి వద్ద సకల విద్యలను అభ్యసించినట్లు తెలిపారు. శ్రీరాముడు – హనుమ మధ్య దాస్య భక్తిని, శరణాగతిని తెలియజేశారు. ఎస్వీ వేద వర్సిటీ ఉపకులపతి ఆచార్య రాణి సదాశివ మూర్తి ఉపన్యసిస్తూ అంజనాదేవి, కేసరి, హనుమంతుల వారి జన్మ వృత్తాంత ఘట్టాలను వివరించారు. అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు డాక్టర్ విభీషణ శర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో పీఠాధిపతి

శ్రీవారిని ఆదివారం ఇన్‌కమ్ ట్యాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ రేణుక జవహరి, సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం రేవంత్ కుమార్ రెడ్డి, శ్రీమఠం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి దర్శించుకున్నారు.

క్లుప్తంగా

భూసేకరణలో అవకతవకలపై ఆర్‌ఐ, వీఆర్‌ఓ సస్పెన్షన్

నెల్లూరు(దర్గామిట్ట): కండలేరు జలాశయానికి సంబంధించి కలువాయి మండలం చౌటపల్లిలో జరిగిన భూసేకరణలో అవకతవకలపై సస్పెన్షన్ల పరంపర కొనసాగుతోంది. గతంలో ముగ్గురు తహసీల్దార్లపై వేటు పడిన విషయం తెలిసిందే. తాజాగా మరో ఇద్దరిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఎం.హరి నారాయణన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కలువాయిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి ప్రస్తుతం పొదలకూరులో ఉన్న నవీన్‌కుమార్, గతంలో చౌటపల్లి వీఆర్వోగా పనిచేసి ప్రస్తుతం అదే మండలం కనుపూరుపల్లిలో ఉన్న జయరామయ్యను సస్పెండ్ చేశారు. చౌటపల్లి చెరువుకు సంబంధించి భూసేకరణలో అవకతవకలు జరగడంతో వారిపై వేటు పడింది.

రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యంతో విజిలెన్స్ అధికారులు

పెళ్లకూరు : మండలంలోని పునబాక తూర్పు కండ్రిగ గ్రామం వద్ద ఆదివారం అక్రమంగా తరలిస్తున్న 60 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యం దందాపై విజిలెన్స్ సీఐ శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కొంతకాలంగా నిఘా పెట్టారు. ఈ మేరకు దాడి చేసి రేషన్ బియ్యంతోపాటు ఓ వాహనాన్ని సీజ్ చేశారు. కేసు నమోదు చేసి పోలీసులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. దాడితో సీఎస్ డీటీ ఓబయ్య పాల్గొన్నారు.

ప్రగతి శాశ్వతం

మహాత్మా గాంధీజీ కలలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇప్పటికే సచివాలయ వ్యవస్థను గ్రామీణులకు అందుబాటులోకి తెచ్చింది. ఇప్పుడు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులో ఉండేలా చర్యలు వేగవంతం చేసింది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ శాశ్వత భవనాలను శరవేగంగా నిర్మిస్తోంది. వివిధ భవన నిర్మాణ పనులు తుదిదశకు చేరడంపై ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తోంది.

- పల్లెల్లో జోరుగా ప్రభుత్వ భవన నిర్మాణాలు
- రూ.438.89 కోట్లతో శాశ్వత భవనాలు
- గ్రామస్వరాజ్యం దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామీణులు



సచివాలయ భవనం (ఇన్‌సెట్) హెల్త్ క్లినిక్ భవనం



ఆర్బీకే భవనం



తిరుపతి అర్బన్: వడ్డించేవాడు మనవాడైతే బంతిలో ఎక్కడ కూర్చున్నా ఇబ్బంది లేదన్నది అప్పటి పెద్దల మాట. అలాగే పాలించేవాడు ప్రజల మనిషి అయితే అడక్కపోయినా అభివృద్ధి చేస్తారనేది ఇప్పటి యువత మాట. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అభివృద్ధిని నగరాలు, పట్టణాలకే పరిమితం చేయకుండా గ్రామస్థాయిలోనూ పరుగులు పెట్టిస్తున్నారు. మహాత్మాగాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని ప్రజలకు చేరువచేస్తుండడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 482 సచివాలయ భవనాలు

క్షేత్రస్థాయిలో సేవలందించడానికి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ భవన నిర్మాణాలను శరవేగంగా నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 482 సచివాలయ భవనాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఒక్కో భవనానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.40 లక్షలు చొప్పున, మొత్తం రూ.192.8 కోట్లు హెచ్చించింది. ఇప్పటికే 50శాతం భవన నిర్మాణాలు పూర్తయ్యాయి.

385 హెల్త్‌క్లినిక్‌లు

గ్రామీణులకు సరైన వైద్యం అందించడానికి ప్రభుత్వం హెల్త్‌క్లినిక్‌లను అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలో మొత్తం 385 హెల్త్‌క్లినిక్‌ల భవనాలు నిర్మిస్తుండగా.. ఒక్కో భవన నిర్మాణానికి రూ.17.5 లక్షలు మంజూరు చేసింది. ఆ మేరకు మొత్తం రూ.67.38 కోట్లు ఖర్చుచేస్తోంది. ఇప్పటికే 55 శాతం భవనాలు పూర్తవగా.. మరో రెండుమూడు నెలల్లో 100 శాతం పనులు పూర్తికానున్నాయి.

203 డిజిటల్ లైబ్రరీలు

విశ్రాంతి ఉద్యోగులతోపాటు నిరుద్యోగ యువతకు ఉపయోగపడే పుస్తకాలు, దినపత్రికలు అందుబాటులోకి తీసుకురావడానికి గ్రామీణ ప్రాంతాల్లో 203 డిజిటల్ లైబ్రరీలు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఒక్కో భవన నిర్మానానికి రూ.16 లక్షల చొప్పున మొత్తం రూ.32.48 కోట్లు ఖర్చుచేస్తోంది. ఇప్పటికే 60 శాతం పనులు పూర్తయ్యాయి.

59 పాలశీతలీకరణ భవనాలు

గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులు అధికం. ఈ నేపథ్యంలో పాలసేకరణకు వీలుకల్పించడానికి పాలశీతలీకరణ భవనాలను నిర్మిస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలో మొత్తం 59 పాలశీతలీకరణ భవనాలు నిర్మిస్తుండగా, ఒక్కో భవన నిర్మాణానికి రూ.17 లక్షల చొప్పున మొత్తం రూ. 10.03 కోట్లు ఖర్చుచేస్తోంది.

431 ఆర్బీకేల నిర్మాణం

రైతులకు సబ్సిడీ విత్తనాలు, పనిముట్లు, ఎరువులు పంపిణీ చేయడానికి వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులో తెచ్చింది. ఆ మేరకు పల్లెల్లో 431 వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు నిర్మిస్తోంది. ఒక్కో భవన నిర్మానానికి రూ.31.6 లక్షల చొప్పున, మొత్తం రూ.136.2 కోట్లు వెచ్చించింది. ఇందులో 60 శాతం భవనాలు పూర్తవగా మరో 40 శాతం భవన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి.

గ్రామస్వరాజ్యం వచ్చింది



ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి సమస్యలు తెలుసుకుంటున్నారు. ఇంతటి గొప్ప పరిపాలన ఎప్పుడూ చూడలేదు. వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలతో రైతులకు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుతున్నాయి. మొత్తంగా జగనన్న ప్రభుత్వం గ్రామస్వరాజ్యాన్ని తీసుకొచ్చింది.

–మునికుమార్, రైతు, పల్లం గ్రామం, ఏర్పేడు మండలం

ఒకేచోట సేవలు



వివిధ సమస్యలుంటే పలు కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో ఇబ్బందులు ఎదురయ్యేవి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఒకేచోట అన్ని సేవలు పొందుతున్నాం. సమయం ఆదా అవుతోంది. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో సేవలు అందిస్తున్నారు.

–మోహన్,తిరుపతి,వ్యాపారి

త్వరలో 100 శాతం పూర్తిచేస్తాం



జిల్లాలో ప్రభుత్వ భవన నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే 50 శాతానికి మించి పనులు పూర్తయ్యాయి. త్వరలో 100శాతం పనులు పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, జేసీ డీకే బాలాజీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సూచనలు చేస్తున్నారు.

–శంకర్‌నారాయణ, పంచాయతీరాజ్ జిల్లా అధికారి

తిరుపతి బులియన్



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.63,050
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,662
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,500
రిటైల్ వెండి గ్రాము	రూ.76.50

అంతర్రాష్ట్ర షటిల్ టోర్నీ విజేత తమిళనాడు



ట్రోఫీతో క్రీడాకారులు

నాయుడుపేటటౌన్ : పట్టణంలో నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీలో తమిళనాడు క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. నాయుడుపేట ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో జరుగుతున్న పోటీల్లో ఆదివారం ఫైనల్స్ నిర్వహించారు. తమిళనాడుకు చెందిన వెంబరసన్, గణేష్ విజేతలుగా , ఆ రాష్ట్రానికే చెందిన కలైఅరసు, పురుషోత్తమన్ రన్నర్స్‌గా నిలిచారు. గూడూరుకు చెందిన సాయి, కిరణ్‌మౌళి తృతీయస్థానం దక్కించుకున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. విజేతలకు వరుసగా రూ.35వేలు, రూ.25వేలు, రూ.15వేల నగదు బహుమతులు పంపిణీ చేశారు. ప్రతిభ కనబరచిన విజయవాడ ఆటగాళ్లు చంద్ర, గోపీనాథ్‌కు ప్రత్యేక బహుమతి అందించారు. టోర్నీలో ఐదు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏటా నిర్వహించే ఈ పోటీల్లో మూడు సార్లు విజేతలుగా నిలిచిన వారికి రోలింగ్ చాంపియన్‌షిప్ ట్రోఫీ బహూకరించనున్నట్లు వివరించారు. సహకరించిన అధికారులు, నాయకులు, అభిమానులలకు ఎఫ్‌బీఏ వారు కృతజ్ఞతలు తెలిపారు.

హనుమా.. కనుమా!

- ఘనంగా హనుమజ్జయంతి
- తిరుమలలో అలరించిన భక్తి సంగీత కార్యక్రమాలు
- వెంకటగిరిలో వైభవంగా శోభాయాత్ర
- పెంచలకోనలో క్షేత్రోత్సవం



ఆకాశగంగలో కీర్తనలు ఆలపిస్తున్న కళాబృందం



తిరుమల మొదటిఘాట్‌లోని ఆంజనేయస్వామి గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

తిరుమల: తిరుమలలో ఆదివారం హనుమజ్జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆకాశగంగ, జాపాలి తీర్థంలో జరిగిన భక్తి సంగీత కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆకాశగంగలోని శ్రీ బాలాంజనేయస్వామివారి ఆలయం వద్ద ఉదయం 9 నుంచి 10 గంటల వరకు హిందూ ధర్మ ప్రచార పరిషత్ కళాకారులు శ్రీరామ నామ సంకీర్తనలు ఆలపించారు. అనంతరం చిన్నారులు హనుమాన్ చాలీసా పఠించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు దాససాహిత్య వాగ్గేయకారులు హనుమత్ సంకీర్తనలను గానం చేశారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు హిందూ ధర్మ ప్రచార పరిషత్ కళాకారులు ఆంజనేయస్వామివారి అవిర్భావంపై హరికథ పారాయణం చేశారు. జాపాలి క్షేత్రంలో టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి పీఆర్ ఆనంద తీర్థాచార్యులు ఆధ్వర్యంలో కళాకారులు ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు హనుమాన్ చాలీసా పఠించారు. ఉదయం 10.30 నుంచి 11.30 ఎస్వీ సంగీత, నృత్య కళాశాల అధ్యాపకులు వందన ఆధ్వర్యంలో హనుమాన్ కీర్తనలను సుమధురంగా ఆలపించారు. ఉదయం 11.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు చిన్నారులు బాల ఆంజనేయ విజయం నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. అనంతరం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు పలు భక్తి సంకీర్తనలతో అలరించారు.

వెంకటగిరి: పట్టణంలో ఆదివారం ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు జరుపుకున్నారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వైభవంగా హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు తరలివచ్చారు. ముందుగా మోటారుసైకిళ్లతో భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం పాత విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నుంచి శోభాయాత్ర ప్రారంభించారు. త్రిభువని సెంటర్, కైవల్యానది పాత వంతెన మీదుగా కాశీపేట, బజారువీధి, మార్కెట్‌వీధి, వీరాంజనేయస్వామి ఆలయం, పోలేరమ్మ ఆర్చిసెంటర్, పాత బస్టాండ్, తూర్పువీధి, దక్షణపువీధి, బోసుబొమ్మ సెంటర్ నుంచి కాశీవిశ్వనాథస్వామి ఆలయం వరకూ యాత్ర సాగింది. ఇందుకూరుపేటకు చెందిన శ్రీలలితా భరద్వాజ దత్తపీఠం పీఠాధిపతి డాక్టర్ రామాయణం మహేష్‌స్వామి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పార్టీలకు అతీతంగా నేతలు, కార్యకర్తలు భక్తిభావంతో యాత్రలో భాగస్వాములయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు, టీడీపీ నేత డాక్టర్ బి.మస్తాన్‌యాదవ్, వీహెచ్‌పీ నాయకులు సుంకర రవికుమార్, వడ్లమూడి భాస్కర్, ఏ.శివప్రసాద్, పవన్, మల్లికార్జున్, దశయ్య, శేషాద్రి, బీజేపీ నేత శ్రావణ్‌కుమార్, సమరతా ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ అద్దంకి విజయలక్ష్మి పాల్గొన్నారు.

రాపూరు : పెంచలకోనలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని వీరాంజేయస్వామివారికి ఆదివారం రాత్రి వైభవంగా క్షేత్రోత్సవం నిర్వహించారు. స్వామివారి మూలమూర్తికి ఉదయం అభిషేకం, పూలంగిసేవ, చందనాలంకారం,ఆకుపూజ,వడమాలలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.రాత్రి 7 గంటలకు శ్రీవారి కల్యాణ మండపంలో తిరుచ్చిపై ఆంజనేయస్వామి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. మంగళవాయిద్యాలతో వేదపండితులు మంత్రోచ్ఛారణల నడుమ క్షేత్రోత్సవం జరిపించారు. అలాగే రాపూరులోని శ్రీరామమందిరంలో ప్రసన్నాంజేయునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు రామనాథేశ్వరశర్మ తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. మద్దెలమడుగులో అయ్యప్ప ఆలయ ప్రాంగణంలోని 30 అడుగుల ఆంజేయస్వామి విగ్రహానికి విశేష పూజలు జరిపించారు. భక్తులకు అన్నదానం చేపట్టారు.



పెంచలకోనలో విహరిస్తున్న వీరాంజనేయుడు



వెంకటగిరి : ఊరేగుతున్న ఆంజనేయస్వామి



వెంకటగిరి : శోభాయాత్రలో పీఠాధిపతి మహేష్‌స్వామి, తదితరులు

ఫుట్‌బాల్ టోర్నీ విజేత తమిళనాడు



విజేత జట్టుకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేటటౌన్ : పట్టణంలో నాలుగు రోజులపాటు నిర్వహించిన సౌత్ ఇండియా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో తమిళనాడులోని చెన్నై సిటీ పోలీస్ జట్టు విజేతగా నిలిచింది. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన 16 జట్లు పాల్గొనగా.. చెన్నై సిటీ పోలీస్ జట్టు, విశాఖపట్నం, చెన్నై మీంజురు క్లబ్ జట్టు, హైదరాబాద్ ఫలక్‌నుమా జట్టు సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఈ జట్ల మధ్య ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన పోరులో చెన్నై సిటీ పోలీస్ జట్టు విశాఖపట్నం జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. సాయంత్రం జరిగిన ఫైనల్స్‌లో చెన్నై సిటీ పోలీస్ జట్టు విజేతగా నిలిచింది. రన్నర్స్‌గా విశాఖపట్నం గంటా బ్రదర్స్ జట్టు నిలిచింది. తృతీయ స్థానాన్ని హైదరాబాద్ ఫలక్‌నుమా జట్టు కైవసం చేసుకుంది. ఉత్తమ ప్లేయర్‌గా జెర్రీ, గోల్ కీపర్‌గా షిగో ఎంపికయ్యారు. విజేతలకు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చేతులమీదుగా ట్రోఫీలు, నగదు బహుమతులను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫుట్‌బాల్ పోటీలను నిర్వహించిన నాయుడుపేట క్లబ్ వారిని అభినందించారు. నిర్వాహకులు భవాన్ అనుదీప్, కోచ్ సయ్యద్ గౌస్‌బాషాను సత్కరించారు. కమిషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కటకం దీపిక, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు